# స్వర్గంలో ఆమెకి చోటు లేదు

## నవల్ ఎల్ సాదవి

## అనువాదం: పి. సత్యవతి

**ఆ**మె తన క్రింద వున్న నేలను అరచేతితో తాకి చూసింది. చేతికి మట్టి తగలలేదు. మెడ పైకెత్తి వెలుతురు వైపు చూసింది.

ఆమె మొహం బక్కచిక్కి పొడుగు సాగినట్లుగా వుంది. చర్మం నల్లటి నలుపు వర్ణంలో వుంది.

ఆ చీకట్లో ఆమె ముఖం ఆమెకి కనపడదు. పైగా ఆమె చేతిలో అద్దం కూడా లేదు. అయితే తెల్లటి వెలుగురేఖ ఒకటి ఆమె చేతి మీద పడి ఆ చెయ్యి తెల్లగా కనిపించింది. ఆమె చీకిరి కళ్ళు విస్మయంతో వెడల్పై, అవి కూడా వెలుగు నింపుకున్నాయి. అట్లా విచ్చుకుని వెలుగు నింపుకున్న ఆ కళ్ళు స్వర్గంలో వుండే దేవకన్యల కళ్ళలా వున్నాయి.

ఆమె విస్మయంతోనే తల కుడికీ ఎడమకీ తిప్పి చూసింది. పైన ఒక పెద్ద మైదానం, అక్కడ ఒత్తైన చెట్లు... తానొక వెండి మడుగు లాంటి జలధార ఒడ్డున కూచుని వుంది. అందులోనించీ పడే నీటి తుంపరలు మంచిముత్యాలలా వున్నాయి. కళ్ళు మరింత విప్పార్చుకుని చూసింది.

ఏమాత్రం మార్పు లేకుండా అదే దృశ్యం. తన దుస్తుల్ని ఒకసారి తాకి చూసుకుంది. అవి పట్టువస్త్రాలలా సుతిమెత్తగా వున్నాయి. వాటిలోనించీ కస్తూరి పరిమళమో మరేదో తేలివస్తోంది. ఆమె తలనీ, కళ్ళనీ అట్లాగే నిశ్చలంగా వుంచింది. ఎందుకంటే ఎన్నోసార్లలాగే ఈసారి కూడా కనురెప్పపాటులోనే ఆ దృశ్యం అదృశ్యం కావచ్చు. కంటి కొసల్నించీ ఆమె కనిపెడుతూనే వుంది. తన ముందు అనంతంగా వృక్షాలు పరుచుకుని వున్నాయి. ఆ వృక్షాల మధ్యను ఒక ఎర్రని రాజభవనం, దాని పడకటింటికి దారితీసే తెల్లని పాలరాతి మెట్లూ ఆమెకి కనిపించాయి. ఈ సంఘటనని నమ్మవచ్చో నమ్మకూడదో అర్థంకాక చాలాసేపు అట్లా నిశ్చలంగా వుండిపోయింది. ఇట్లా తను చనిపోయి స్వర్గంలో కళ్ళు విప్పడం అనే ఈ కల తనకి పదే పదే రావడం ఆమెకి విసుగు తెప్పించింది. ఇది అసంభవం. ఎందుకంటే తను చనిపోవటం అసంభవం. చనిపోయిం తరవాత మేల్కోటం ఇంకా అసంభవం. అంతకన్న అసంభవం ఏమిటంటే తను స్వర్గానికి వెళ్లటం.

అనువాదకథ

నిదారుగా మెడ ఎత్తి, కంటి కొసలనించీ మరొకసారి వెలుతురువైపు చూసింది. ఏమాత్రం మార్పులేకుండా మళ్ళీ మళ్ళీ-అదే దృశ్యం. అదే ఎర్రటి భవనం, అవే పాలరాతి సోపానాలు, పడకగదికి సోపానాలు, గది మొత్తం వెలుగులో స్నానమాడుతున్నట్లుంది. ఆ గది కిటికీ ఎక్కడో దిగంతాలలోకి చూస్తున్నట్లుంది. విశాలమైన శయ్య, దానికి అమర్చిన నాలుగు పట్టీలకి కట్టిన పట్టుతెరలు. అన్నీ అక్కడే వున్నాయి.

ఇదంతా చాలా వాస్తవంగా వుంది కనక అసంభవమనడానికి కుదరదు. కదలడానికీ, అదంతా నమ్మడానికీ కూడా భయపడుతూ ఆమె అక్కడే నిశ్చలంగా వుండిపోయింది. చనిపోయిన వెంటనే లేవడం, లేచి స్వర్గానికి రావడం, నిజంగా సాధ్యమేనా? ఇదంతా ఇంత మెరుపువేగంతో జరగడమే తనకి నమ్మశక్యం కాకుండా వుంది. చనిపోవడం ఏముంది. చాలా తేలిక. అందరూ చనిపోతారు. తన చావు మరింత తేలికైన విషయం.

ఎందుకంటే తనెప్పుడూ చావుబ్రతుకుల మధ్యే ఊగులాడింది. జీవితానికి ఎడంగా మృత్యువుకి సన్నిహితంగా బ్రతికింది. తను జన్మించినప్పుడు అమ్మ తనమీద ఎంత వత్తిడి పెట్టిందంటే తను నిజంగా చనిపోయివుండేది. నాన్న ఒకసారి పారతో తన నెత్తిమీద చచ్చేటట్లు కొట్టాడు.



తన ఎనిమిదో సంతానం జన్మించేవరకూ కూడా ప్రతి ప్రసవంలోనూ తనకి విపరీతమైన జ్వరం వచ్చి చచ్చిబ్రతికేది. భర్త తన కడుపుమీద ఈడ్చీడ్చి తన్నినప్పుడు, తన తల ఎముకలు సూర్యుడి ప్రతాపం అనుభవించేవి. తనకి జీవించడమే కష్టంగానూ మృత్యువే హాయైనదిగానూ అనిపించేది. చనిపోయింతరవాత లేవడం ఇంకా హాయిగా వుంది, ఎందుకంటే ఎవరూ కూడ చనిపోయిం తరవాత లేవరు. చనిపోయిం తరవాత పునర్వికసనం పొందుతారు. ఒక్క జంతువులు మాత్రమే చనిపోయి అలా మృతుల్లాగా వుండిపోతాయి. తను స్వర్గానికి వెళ్లడం కూడా అసంభవాలలో ఒకటి. కానీ నిజానికి, స్వర్గానికి వెళ్ళే అర్హత తనకన్న ఎవరికుంది. జీవించినంతకాలం, భగవంతుణ్ణికానీ, ప్రవక్తని కానీ నొప్పించే పనేదీ తను చెయ్యలేదు. తన నల్లటి జుత్తుని ఎప్పుడూ జడ అల్లుకుని ఒక ఊలు ముక్కతో గట్టిగా కట్టుకునేది. ఆ జడని ఒక తెల్లని రుమాలులో చుట్టుకునేది.

హుస్సేన్ గురించి తలుచుకున్నప్పుడల్లా ఇలా చేతిలో చెయ్యి వేసుకుని చెట్ల నీడన కూచోడం తప్ప ఆమె ఊహలు ఇంకా ఏమాత్రం ముందుకెళ్ళేవి కావు. కానీ హుస్సేన్ పేరు చెప్పగానే అమ్మ తిట్టేది. హుస్సేన్ గానీ ఇంకా ఇతర పురుషుడు గానీ స్వర్గంలో ఉండరనీ, ఆమె తన తండ్రి, సోదరులను తప్ప ఏ పురుషుడినీ కన్నెత్తి చూడటం గానీ మాట్లాడడం గానీ ఊహల్లోకి రానివ్వడంగానీ కూడదనీ చెప్పింది.

ఆ పైన తన తల మొత్తాన్ని ఒక నల్లని శాలువతో కప్పుకునేది. ఆమె దుస్తులోనుంచీ ఆమె కాలి మడమ తప్ప చూశేవాళ్ళకి ఏ శరీర భాగమూ కనపడకుండా జాగ్రత్త పడేది. పుట్టినప్పటినించీ చచ్చేవరకూ "అలాగే" అనేమాట తప్ప మరొక మాట మాట్లాడి ఎరగదు.

ఇంకా నిద్రపోతున్న తనని తెల్లవారుఝామునే ఒక దెబ్బవేసి నిద్రలేపి పేడ తట్ట మొయ్యమని అమ్మ ఆజ్ఞాపిస్తే "అలాగే" అంది, బావినించీ నీళ్ళు చేదే చక్రం తిప్పే ఆవుకి జబ్బుచేస్తే, ఆ ఆవు స్థానంలో తనని కడతానని నాన్న అన్నప్పుడూ "అలాగే" అంది. ఎన్నడూ కళ్ళెత్తి భర్త మొహం చూసి ఎరగదు. అంతులేని జ్వర తీవ్రతలో కూడా అతని కామానికి వొళ్లప్పగించేది.


ఎప్పుడూ దొంగతనం చేసి ఎరగదు. అబద్ధమాడలేదు. ఆకలికి మాడి చావనైనా చచ్చేదికానీ ఇతరుల ఆహారాన్ని ఎప్పుడూ ముట్టుకోలేదు. తన తండ్రికోసమో, సోదరుడికోసమో, భర్తకోసమో అన్నంమూట తీసుకెళ్ళేటప్పుడు కూడా ఆ మూట ఏనాడూ విప్పి చూడనేలేదు. ఎప్పుడైనా విప్పి చూడాలని, తినాలని అనిపించేది. కానీ అట్లా అనిపించినప్పుడల్లా ఆమె భగవంతుణ్ని ప్రార్థించేది. పాపం చెయ్యకుండా తనని కాపాడమని. మరీ ఆకలికి తట్టుకోలేనప్పుడు బాటపక్క పెరిగిన గడ్డిపోచలు నాలుగు పెరికి వాటిని నములుతూ పోయేది. చివరికి కాలవలో నీళ్ళు కాసిని దోసిట్లోకి తీసుకుని ఆ నమిలిన పదార్థాన్ని మింగేసి, మరిన్ని నీళ్ల తాగేది. చేతులు తుడుచుకుంటూ భగవంతుడికి మూడుసార్లు కృతజ్ఞతలు చెప్పేది రోజుకి అయిదుసార్లు నమాజ్ చేసేది. తనకెంత జ్వరం వచ్చినా తల అగ్నిగోళంలా మండిపోతున్నా భగవంతుడికి ఎప్పుడూ కృతజ్ఞతలు చెప్పుకుంటూనే వుండేది. ఉపవాస దినాల్లో ఉపవాసం చేసింది, వంటలు వండాల్సినప్పుడు వండింది, పొలం పనుల రోజుల్లో పొలం పని చేసింది. పుణ్యదినాల్లో నల్లని దుస్తులు ధరించి సమాధులను దర్శించి వచ్చేది. తండ్రికి గానీ, సోదరుడికి కానీ, భర్తకు గానీ ఎప్పుడూ ఎదురు తిరగలేదు.

భర్త ఆమెను చచ్చేలా కొట్టి తరిమినప్పుడు తండ్రి ఇంటికి వచ్చేది. తండ్రి ఆమెను తిరిగి భర్త ఇంటికి పంపేవాడు. ఆమె మళ్ళీగాని తిరిగి వచ్చిందా...

ఈసారి తండ్రి కూడా ఆమెని కొట్టి తిప్పి పంపేవాడు. భర్త ఆమెని ఇంట్లోకి రానిచ్చి మళ్ళీ కొడితే తల్లికి మొర పెట్టుకునేది. అప్పుడు ఆమె తల్లి "నువ్వు నీ భర్త దగ్గరకే వెళ్ళు జైనాబ్, అక్కడే నీకు మోక్షం. తరవాత నీకు స్వర్గప్రాప్తి కలుగుతుంది" అని సముదాయించి పంపేది. ఈ స్వర్గం అనే మాట తను పుట్టినప్పటినించీ తల్లి నోట వింటూనే వుంది. మొదటిసారి ఆ మాట విన్నప్పుడు తను నెత్తిన పేడ తట్ట పెట్టుకుని ఎర్రటి ఎండలో పాదాలు పుళ్ళుపడేలా నడుస్తోంది. స్వర్గం అంటే విశాలమైన ప్రదేశమనీ అక్కడంతా నీడేననీ అక్కడ తన నెత్తి మీద పేడ తట్టలుండవనీ, తమ పొరుగింటి అబ్బాయి హుస్సేన్ వేసుకునేలాంటి చెప్పులు తను కూడ ధరించవచ్చనీ ఊహించుకుంది జైనాబ్. అక్కడ తనూ హుస్సేన్ చేతిలో చెయ్యి వేసుకుని చెట్లనీడన కూర్చుని వుంటారని కూడా ఊహించుకుంది. హుస్సేన్ గురించి తలుచుకున్నప్పుడల్లా ఇలా చేతిలో చెయ్యి వేసుకుని చెట్ల నీడన కూచోడం తప్ప ఆమె ఊహలు ఇంకా ఏమాత్రం ముందుకెళ్ళేవి కావు. కానీ హుస్సేన్ పేరు చెప్పగానే అమ్మ తిట్టేది. హుస్సేన్ గానీ ఇంకా ఇతర పురుషుడు గానీ స్వర్గంలో ఉండరనీ, ఆమె తన తండ్రి, సోదరులను తప్ప ఏ పురుషుడినీ కన్నెత్తి చూడటం గానీ మాట్లాడడం గానీ ఊహల్లోకి రానివ్వడంగానీ కూడదనీ చెప్పింది. ఒకవేళ ఆమెకి వివాహం అయిన తరువాత ఆమె గనక స్వర్గానికి వెడితే అక్కడ ఆమె భర్త తప్ప ఎవరూ ఉండరని కూడా చెప్పింది. ఒకవేళ ఆమెకి ఏ పరపురుషుణ్ని చూసైనా మనసు చెదిరిందో, ఇక స్వర్గానికి వెళ్లటం కాదు కదా దాన్ని కొన్నివేల మైళ్ళ దూరంనించీ చూడ్డం కూడా సాధ్యం కాదంది. అప్పటినించీ తనెప్పుడు స్వర్గాన్ని గురించి తలుచుకున్నా అక్కడ తన భర్తే ఉండేవాడు. తన నెత్తిమీద పేడ తట్టలుండవు. అతను తనని కొట్టడు. ఎండకి కొలిమిలా కాలే నేలమీద తన పాదాలు మాడిపోవు. తన నల్లటి మట్టి ఇంటిస్థానంలో ఎర్రటి ఇటుకలతో కట్టిన ఎర్రటి ఇల్లు ఉంటుంది. దానిలోపల పడకగదిలోకి తెల్లని పాలరాతి మెట్లుంటాయి. అందులో విశాలమైన శయ్య ఉంటుంది. దానిమీద తనూ తన భర్తా చేతిలో చెయ్యి వేసుకుని కూచుని వుంటారు.

ఆమె ఊహలు అంతకి మించి ముందుకెళ్ళేవి కావు. ఇంతవరకూ ఎన్నడూ తన భర్త తనచేతిని ఆప్యాయంగా పట్టుకోనేలేదు. చేతులు పట్టుకోకుండానే ఎనిమిదిమంది సంతానానికి జన్మనిచ్చింది. వేస రాత్రులలో అతను పొలంలో పడుకుంటాడు. శీతాకాలంలో వెచ్చగా ధాన్యపు గిడ్డంగిలో పడుకుంటాడు.

రాత్రంతా అట్లా కదలకుండా వెల్లికిలా



పడుకుంటాడు. ఎప్పుడైనా కదిలాడో నక్క ఊళ పెట్టినట్లు "ఒసేయ్" అని పెద్దగా ఒక అరుపు అరుస్తాడు.

ఆమె బదులు పలికేలోగానే ఆమెని రెండు తన్నులు తన్ని మీద పడిపోతాడు. ఆమెనించీ నిట్టూర్పులాంటి శబ్దమేదీ రాకపోయిందో, అది వెలువడేదాకా మళ్ళీ తన్నులే. అదే శృంగారం. అందులో చేతులు పట్టుకోడాలూ కౌగలించుకోడాలూ ఉండవు. ఆమె ఇంతవరకూ మనుష దంపతులు గానీ జంతు జంటలుగానీ కౌగలించుకోడం చూడలేదు. ఎప్పుడైనా రెండు పావురాళ్ళు వాటి ముక్కులు దగ్గర దగ్గర పెట్టుకుని గోడమీద కూచోటం చూసింది. గొడ్ల దొడ్లో ఎప్పుడైనా ఒక ఎద్దు ఆవు వెనక తిరిగితే అమ్మ వెదురుకర్రతో వాటిని అదిలిస్తూ తిట్లకి లంకించుకునేది.

జీవితంలో ఎప్పుడూ తన తలనిండా కప్పుకున్న నల్లశాలువని కానీ జుత్తు కనపడకుండా కట్టుకున్న తెల్లరుమాలు కానీ తీసెరగదు. తన భర్త చనిపోయినప్పుడు మాత్రం ఆ నల్ల శాలువని తన నుదుటి చుట్టూ రెండుసార్లు తిప్పి ముడేసుకుంది. మూడు సంవత్సరాలపాటు సంతాపం సూచించే దుస్తుల్నే ధరించింది. తరవాత ఒకాయన వచ్చి పిల్లల్ని వదిలేసి వస్తే తనని పెళ్లి చేసుకుంటానన్నాడు. అమ్మ కోపంతో తన మొహం మీద ఉమ్మేసినంత పనిచేసి, నుదుటిచుట్టూ వున్న నల్ల శాలువని మొహం మీదకి లాగింది". ఒక మొగవాడికోసం ఏ తల్లైనా తన పిల్లల్ని వదులుకుంటుందా? సిగ్గులేదా నీకు? అని అరిచింది. కొంతకాలం అయ్యాక ఇంకొకాయన తనని పిల్లలతో సహా పెళ్ళి చేసుకుంటానన్నాడు. అమ్మ ఈసారి కప్పెగిరిపోయేలా అరిచింది. "పిల్లల తల్లి అయ్యాక, భర్త చనిపోయిన స్త్రీకి ఈ ప్రపంచంలో ఇంకేంకావాలి" అని. ఒకసారి తనకి తన నెత్తిన కప్పుకున్న నల్లశాలువ తీసేసి ఒక్క తెల్లరుమాలు మాత్రమే వుంచుకోవాలనిపించింది. కానీ మళ్ళీ భయ మేసింది. లోకులేమనుకుంటారు? తను తన భర్తని మర్చిపోయిందను కోరా? అందుకే ఆ ముసుగుని ఆసాంతం అలాగే వుంచుకుంది. సంతాప చిహ్నాలని కూడా అలాగే వుంచుకుంది.

విచారంగా కనపడీ కనపడీ ఆ విచారంతోనే కళ్ళు మూసింది.

తనని ఒక పట్టువస్త్రం శవపేటికలో పడుకోబెట్టారు. శవయాత్ర సాగుతోంది. వెనకనించీ అమ్మ ఏడుపు వినపడుతోంది...

"నువ్వు స్వర్గంలో నీ భర్తని తప్పకుండా కలుస్తావు జైనాబ్" అని అరుస్తోంది. రైలింజన్‌లాగా...

శబ్దాలు ఆగిపోయాయి. అంతా నిశ్శబ్దం మట్టివాసన తప్ప ఏ వాసనా రావడంలేదు. తన అడుగున వున్న మట్టి, పట్టులా మెత్తగా ఉంది. ఒకవేళ అది తనకి కప్పిన వస్త్రమేమో!! తరువాత తన తలపై నించీ రెండు గొంతులు వినపడ్డాయి. అవి ఒకరితో ఒకరు పోట్లాడుకు న్నట్లున్నాయి. అది తన గురించేనని తరవాత ఆమెకి అర్థం అయింది.

"సమాధిలో ఏ విధమైన హింస అనుభవించకుండా నేరుగా స్వర్గానికి వెళ్ళే అర్హత ఈమెకుంది" అంది ఒక గొంతు. అవతలి మనిషి అందుకు ఒప్పుకోకుండా "కాదు కాదు. ఆమె సమాధిలో ఏ కాస్త అయినా సరే హింస అనుభవించాలి నేరుగా స్వర్గానికి పోడానికి వీల్లేదు" అన్నాడు.

శబ్దాలు ఆగిపోయాయి. అంతా నిశ్శబ్దం మట్టివాసన తప్ప ఏ వాసనా రావడంలేదు. తన అడుగున వున్న మట్టి, పట్టులా మెత్తగా ఉంది. ఒకవేళ అది తనకి కప్పిన వస్త్రమేమో!! తరువాత తన తలపై నించీ రెండు గొంతులు వినపడ్డాయి.

"ప్రతివాళ్ళూ సమాధిలో హింస అనుభవించా ల్సిందే" అన్నాడు.

"ఆమె తన భర్తపట్ల నూటికి నూరుపాళ్ళు నిజాయితీతో వుండేది. హింస పొందాల్సినంత పాపం ఆమేం చెయ్యలేదు" అన్నాడు మొదటాయన.

"అదేంకాదు. తెల్ల రుమాల్లోనించీ ఆమె జుత్తు పైకి కనిపించేది. ఆమె తన జుత్తుకి ఎర్రగా గోరింటాకు పెట్టేది. అంతేకాదు గోరింటాకు పెట్టుకున్న ఆమె కాలిమడమలు దుస్తుల క్రిందనించీ కనపడేవి" అన్నాడు రెండో ఆయన.

"అంతా అబద్ధం! ఆమె జుత్తుని ఇంతవరకూ ఎవరూ చూడలేదు. నీకు కనపడింది జుత్తుకి ముడేసుకున్న ఊలుముక్క... ఆమె ఎప్పుడూ పొడుగైన దళసరి దుస్తులూ వాటిలోపల ఇంకా పొడవైన లోదుస్తులూ వేసుకునేది. వాటికిందనించీ ఆమె మడమలు చూడ్డం అసాధ్యం".

"ఏంకాదు ఆమె ఎర్రటి మడమలు ఎంతమందినో ఆకర్షించాయి".

ఈ ఇద్దరి వివాదం తెల్లవార్లూ కొనసాగింది. ఆమె మట్టి మీద బోర్లాపడుకుని వుంది. నోరూ, మొహమూ మట్టిలోకి అణచుకుపోతున్నాయి.

తను శ్వాస బిగబట్టి చనిపోయినట్లే వుండిపోయింది. తను చనిపోలే దని తెలిస్తే ఈ హింస ఇంకా కొనసాగుతుంది చనిపోవడమే మేలు.

ఆ తరవాత వాళ్ళిద్దరిమధ్యా ఏంజరిగిందో ఆమెకి తెలీదు. మనిషి చనిపోయాక అతని సమాధిలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు.

ఒకవేళ ఏమైన వినపడినా, కనపడినా తెలీనట్లే నటించాలి. అసలైన విషయం ఏమిటంటే వాళ్ళిద్దరూ సమాధుల్లో అమలుపర్చే శిక్షల్ని నిర్ణ యించే దేవతలేంకారు. అసలెలాంటి దేవతలూ కారు. ఎందుకంటే ఆ ఊళ్ళో ప్రతిమనిషికీ తెలిసిన నిజం దేవతలకెట్లా తెలీకుండా ఉంటుంది?

తన మడమలెప్పుడూ ఎర్రగా లేవని ఊళ్ళో అందరికీ తెలుసు. తన మొహంలాగే, అరచేతుల్లాగే పగుళ్ళు బారి నల్లగా ఉంటాయవి.

అయితే ఆ ఇద్దరి మనుషులమధ్య వివాదం వేకువఝాముకి తెమి లింది. ఆమెకి సమాధిలో ఎటువంటి హింస అవసరం లేదనీ సరాసరి స్వర్గానికి పంపవచ్చనీ తేల్చారు. ఆమె భగవంతుడికి కృతజ్ఞత తెలుపుకుంది. ఆమె శరీరం తేలికై, గాలిలో ఎగరసాగింది. కాసేపు ఆకాశంలో ఎగిరి, ఆమె మెత్తని మట్టిపై పాదం మోపింది. "స్వర్గం" అనుకుంది ఆయాసపడుతూ. తల ఎత్తి చూస్తే అంతా పచ్చని చెట్ల నీడ. నేలమీద కూచుని తేరిపార చూస్తే అనంత వృక్ష సంపద. ఆమె శరీరంలో నిలవవున్న దుమ్మూ, ధూళీ పేడవాసనా పోయి గుండె నిండా తాజా గాలి నిండింది. ఆమె నెమ్మదిగా లేచి నిలబడింది. ఆ చెట్లమధ్యలో ఆమెకి ఎర్రటి ఇల్లూ ఆ ఇంట్లో నించీ పాలరాతి సోపానాలు కనపడ్డాయి. ఆమె ఆఘమేఘాల మీద ఆ ఇంటికి చేరి మెట్లెక్కి లోపల ప్రవేశించింది. ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది. వేగంగా ఊపిరి పీల్చడంతో చాతీ ఎగిసిపడుతోంది. అట్లాగే ఒక్క క్షణం ఆగి, ఊపిరి పీల్చుకుని మూసివున్న ఆ ఇంటి తలుపుని మెల్లగా తీసింది. తను తరచూ కలగన్న అదే విశాలమైన శయ్య. దానికి నాలుగు పట్టు తెరలు...

ఆ మంచం మధ్యలో తన భర్త పెళ్ళికొడుకులా కూచుని ఉన్నాడు. అతని కుడివైపున ఒక స్త్రీ, ఎడమవైపున మరొక స్త్రీ. వారిద్దరూ తమ తెల్లని శరీరాలు కనిపించేటంత పల్చని వలువలు ధరించి ఉన్నారు. వాళ్ల కళ్ళు దేవకన్యల కళ్ళవలె మిరిమిట్లు గొలుపుతున్నాయి. ఆమె భర్త ఆమెకేసి తిరగనూలేదు ఆమెను చూడనూలేదు. ఆమె తలుపు మీద చెయ్యి వేసి అక్కడే నిలబడింది. తరువాత తలుపు మూసేసి గబుక్కున వెనక్కి తిరిగింది.

"నల్లని స్త్రీలకి స్వర్గంలో చోటులేదు" అని తనలో తను అనుకుంటూ ఆమె భూమిమీదకి తిరిగొచ్చింది....

** ** **

(నవల్ ఎల్ సాదవి ఈజిప్ట్‌లో ఒక చిన్నగ్రామంలో 1931లో జన్మించింది. తరువాత వైద్యురాలిగా శిక్షణ పొందింది. అరబ్ స్త్రీలపై లైంగికంగా, సాంస్కృతికంగా జరుగుతున్న అణచివేతను తన రచనల ద్వారా ఎండగట్టి 1970లలో సంచలనం సృష్టించింది. కథాసంకలనాలూ, వ్యాసాలూ చాలా ప్రచురించింది.

ఆమె పుస్తకాలు దాదాపు పధ్నాలుగుదాకా ఇంగ్లీష్‌లోకి అనువాదం అయినాయి. మెహఫౌజ్ తరవాత బహుళ ప్రచారం పొందిన అరబ్ రచయిత. 1981లో ఈజిప్ట్ దేశాధ్యక్షుడైన అన్వర్ సాదత్ ఈమెను జైల్లో నిర్బంధించాడు. ముస్లిం ఛాందసవాదులు ఆమెను బెదిరించటంతో 1990లో ఆమె అమెరికా సంయుక్త రాష్ట్రాలకు వలసవెళ్ళింది. అనేక అమెరికన్ విశ్వవిద్యాలయాలలో విద్యాబోధన చేసింది. వివాదాస్పదమైన రచయిత్రిగా పేరు)